

సత్యసాయి బాబాతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

సత్యసాయి భక్తుడు మన్మోహన్‌సింగ్

ప్రధాని హోదాలో రెండుసార్లు పుట్టపర్తికి..

ఆర్థికమంత్రి హోదాలోనూ రాక..

పుట్టపర్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీప్రధాని మన్మోహన్ సింగ్. సత్యసాయి బాబా భక్తుడు. బాబాతో అత్యంత సాన్నిహిత్యం కలిగి ఉండేవారు. ఈ కారణంగానే మన్మోహన్ సింగ్ పుట్టపర్తికి మూడుసార్లు విచ్చేశారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఓసారి, ప్రధాని హోదాలో పుట్టపర్తికి వచ్చారు. ఆర్థికమంత్రి హోదాలో తొలిసారి సత్యసాయిబాబా సన్నిధికి మన్మోహన్ సింగ్ విచ్చేసారు. ఆ సమయంలో బాబాతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. తరువాత మన్మోహన్ సింగ్ ప్రధాని హోదాలో 2004 నవంబరు 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సత్యసాయిబాబా జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సత్యసాయిబాబా శివైక్యమైనపుడు 2011 ఏప్రిల్ 25న ప్రధాని హోదాలో రెండోసారి మన్మోహన్ సింగ్ పుట్టపర్తికి వచ్చారు. సత్యసాయి పార్థివదేహాన్ని సందర్శించారు. అలా పుట్టపర్తితో మన్మోహన్‌సింగ్‌కు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఆయన మృతితో పుట్టపర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సత్యసాయి బాబా పార్థివదేహాన్ని దర్శించుకుంటున్న మన్మోహన్ సింగ్

శరణం.. అయ్యప్ప..



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న అయ్యప్ప మాలధారులు



కిరికెర అయ్యప్ప ఆలయంలో స్వామికి అలంకరణ

ఘనంగా హరిహర పుత్రుని మండలపూజ

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం... అలరించిన భక్తిగీతాలు

హిందూపురం అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నామస్మరణతో పట్టణం గురువారం మార్మోగింది. బెంగళూరు రోడ్డు, సూరప్పకట్టకింద, కిరికెర, ముద్దిరెడ్డిపల్లిలో అయ్యప్పస్వామి మండలపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో మూల విరాట్లకు అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. మూల విరాట్లను పూలు, నగలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాల్లో భక్తులు ఆలపించిన అయ్యప్ప, ఇతర దేవతామూర్తుల కీర్తనలు మిన్నంటాయి. పాటలతో పరవశింపజేశారు. బెంగళూరు రోడ్డులోని అయ్యప్ప ఆలయంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం ద్వారా భక్తిని చాటారు.

బోగస్ పట్టాలు విక్రయించిన

నలుగురిపై కేసు

కదిరి అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్ట తండా పరిధి సర్వే నంబరు 470లో బోగస్ పట్టాలు తయారు చేసి, విక్రయించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. సున్నపుగుట్టతండా పరిధిలో అదే ఊరికి చెందిన సోమ్లానాయక్, అల్లాబక్ష, నాగేంద్రనాయక్, కుమ్మరవాండ్లపల్లి వాసి మణికంఠనాయక్ బోగస్ పట్టాలు సృష్టించి, విక్రయించినట్లు వీఆర్వో ఇనయతుల్లా ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైతు ప్రభుత్వంలో కు ద్రోహం..!

రైతుమిత్ర సంఘాలపై వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

- పూర్తిగా అటకెక్కించిన వైనం
- సాయం అందక అన్నదాతకు అగచాట్లు
- పునరుద్ధరిస్తే సత్ఫలితాలు

ధర్మవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పారు. ఇదే విషయాన్ని ప్రతి సభలోనూ ఊదరగొట్టారు. చేతల్లో మాత్రం పూర్తి భిన్నంగా వ్యవహరించారు. రైతులకే ద్రోహం చేశారు. రైతుమిత్ర సంఘాలను పూర్తిగా అటకెక్కించారు. వాటిని ఏమాత్రం ఆదరించలేదు. దీంతో ఆ సంఘాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటుచేసిన రైతుమిత్ర సంఘాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుమిత్ర గ్రూపులను పునరుద్ధరిస్తే ఉపయుక్తంగా ఉంటుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.

2003లో ఆవిర్భావం

టీడీపీ అధికారంలో ఉన్నపుడు 2003లో రైతుమిత్ర సంఘాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘంలో 15 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. కొన్ని సంఘాలు సభ్యత్వ రుసుం రూ.20తోపాటు నెలకు రూ.30 నుంచి రూ.60 వరకు పొదుపు చేసుకున్నాయి. ఆ సొమ్ముతో సమన్వయకర్తల పేరిట బ్యాంకు ఖాతాలు కూడా తెరిచారు. అన్ని సంఘాల నిర్వహణ ఖర్చులకుగానూ అధికారులు రూ.2500 మంజూరు చేశారు. అనంతరం క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటున్న రైతుమిత్ర సంఘాలకు రూ.15వేల రివాల్వింగ్ ఫండ్ మంజూరవుతుందని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. సంఘాలు ఏర్పాటైన ఏడాదికి టీడీపీ అధికారం కోల్పోయింది. 2004లో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. దీంతో రైతు మిత్ర సంఘాలు ఉనికిని కోల్పోయాయి.



నిరాదరణ, నిర్లక్ష్యం

ప్రభుత్వ నిరాదరణ, అధికారుల నిర్లక్ష్యంతో రైతుమిత్రసంఘాలు కనుమరుగయ్యాయి. 2004లో అప్పటి కాంగ్రెస్ ఏమాత్రం పట్టించుకోలేదు. 2009లో రైతుమిత్ర సంఘాలను తెరపైకి తెచ్చింది. వాటికి జీవంపోసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 50శాతం సబ్సిడీతో యంత్ర పరికరాలను రైతుమిత్ర సంఘాలకు అందజేసింది. ఈ క్రమంలో వ్యవసాయాధికారులు జిల్లాలో రైతుమిత్రసంఘాల పనితీరును బట్టి గ్రేడింగ్ చేశారు. వాటికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందజేస్తూ వచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టాక రైతు మిత్ర సంఘాలకు ఆదరణ కరువైంది. వాటి నిర్వహణపై గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఆ తరువాత రైతుమిత్ర సంఘాల సంగతే మరచిపోయారు.

పునరుద్ధరిస్తే సత్ఫలితాలు

ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వంపై రైతుమిత్ర సంఘాల సభ్యులు ఆశలు పెటుకున్నారు. సంఘాలను పునరుద్ధరిస్తే సత్ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల తరహాలో రైతుమిత్ర సంఘాల విధివిధానాలను రూపొందించి, వాటిని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



బలోపేతం చేయాలి

రైతుమిత్ర సంఘాలను బలోపేతం చేస్తే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. పంటల సాగు, అత్యవసర సమయాల్లో పెట్టుబడుల కోసం రైతులు వెంపర్లాడాల్సిన అవసరం ఉండదు.

- రేనాటి శ్రీనివాసులు, ధర్మవరం సాగునీటిసంఘం అధ్యక్షుడు

వైసీపీ పాలనలో నిర్వీర్యమయ్యాయి

గత వైసీపీ ప్రభుత్వంలో రైతుమిత్ర సంఘాలను నిర్వీర్యం చేశారు. వాటిని తిరిగి పటిష్ట పరచడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలి. రైతుమిత్ర సంఘాలను పునరుద్ధరించి, బలోపేతం చేయాలి.

-అశ్వత్థనాయుడు, రైతు, ధర్మవరం



బాల్యవివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత అని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓలు, సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 105 బాల్యవివాహాలు నిలుపుదల చేశామన్నారు. ప్రతినెలా డివిజన్, మండలస్థాయిలో బాల్యవివాహాల నిర్మూలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేసిన తల్లిదండ్రులతోపాటు ప్రోత్సహించేవారు కూడా శిక్షార్హులేనన్నారు. చట్టం ప్రకారం యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మీ, కదిరి ఆర్డీఓ వీఎస్ శర్మ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు

వయోవృద్ధుల సమస్యలను మానవత్వంతో సంబంధితాధికారులు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. వయోవృద్ధుల సంక్షేమాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పోషణ, నిర్వహణ బాధ్యత పట్టించుకోని వారి పిల్లలను పిలిపించి, తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఆర్డీఓలు పాల్గొన్నారు.

జగనే పెంచి.. ఇప్పుడు ధర్నాలా..!

టీడీపీ జిల్లా అధ్యక్షుడు



హిందూపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాను అధికారంలో ఉన్నపుడు విద్యుత్ చార్జీలు పెంచిన జగనే ప్రస్తుతం ధర్నాకు పిలుపునివ్వడం శోచనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప విమర్శించారు. పిచ్చితుగ్లక్ చర్యల్లో జగన్‌రెడ్డి మరో మైలురాయి దాటాడని గురువారం ప్రకటనలో దుయ్యబట్టారు. ట్రూఅప్ చార్జీల భారం కచ్చితంగా జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆయన చేసిన పాపాలే ప్రజలకు ప్రస్తుతం శాపాలుగా మారుతున్నాయన్నారు. పీపీఏల రద్దు, సోలార్, పవన విద్యుత్ పెట్టుబడిదారులను జగన్ బెదిరించారన్నారు. తద్వారా విద్యుత్‌లోటుకు కారణమయ్యారన్నారు. జగన్ పాలనలో ఏపీ జెన్‌కోను సర్వనాశనం చేశారన్నారు. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని ఈఆర్‌సీని కోరారన్నారు. అలాంటి ఆయనే ప్రస్తుతం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసేందుకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. జగన్ పిచ్చితుగ్లక్ చర్యలను ప్రజలు గమనించాలన్నారు. విద్యుత్ చార్జీలపై శుక్రవారం వైసీపీ నిరసన తెలపడం ప్రజలను వంచించడమేనన్నారు.



గతంలో గోతులతో నిండిన పులివెందుల రోడ్డు

నాడు-నేడు



ప్రస్తుతం మరమ్మతులు చేశాక ఇలా..

ముదిగుబ్బ నుంచి మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులకు నేరుగా రోడ్డు ఉంది. ముదిగుబ్బలో ఆ రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తేవారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నా.. పులివెందులకు వెళ్లే రోడ్డును కూడా పట్టించుకోలేదు. ఆ రోడ్డులో గుంతలు ఏర్పడి, పెద్దపెద్ద గోతులుగా మారిపోయాయి. వాటిలో చాలామంది వాహనదారులు పడిపోయారు. గాయాలపాలయ్యారు. రోడ్డుకు మరమ్మతులు చేయకుండానే వైసీపీ పాలన ముగిసిపోయింది. స్థానికులు సొంత ఖర్చులతో రోడ్డు గోతుల్లోకి మట్టి తోలుకుంటుండేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే రోడ్డు మరమ్మతులు చేపట్టింది. ప్యాచ్‌వర్కులు చేయడంతో రోడ్డుకు మహర్దశ పట్టుకుంది. ఆ రోడ్డును చూసి, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ముదిగుబ్బ

పంటల సాగులో సమస్యలపై అవగాహన కల్పించాలి

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నివారణ మార్గాలపై వ్యవసాయ పరిశోధక విద్యార్థులు (ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు) విస్తృత కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. గురువారం మండలంలోని జగరాజుపల్లి పెడపల్లి, కొట్లపల్లిలో తిరుపతి వ్యవసాయి కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు అవగాహన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి హాజరై, మాట్లాడారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై డెమో నిర్వహించాలన్నారు. వరి సాగులో కాలిబాటలు వేయడం, భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై వివరించాలన్నారు. విద్యార్థులు వ్యవసాయకళాశాలలో నేర్చుకున్న విషయాలను రైతులకు చేరవేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా విద్యార్థులకు సేవాభావాలు అలవడుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి



తొణికిసలాడుతున్న యోగివేమన రిజర్వాయర్

నిండుకుండ

పూర్తిగా నిండిన యోగివేమన రిజర్వాయర్

రెండు గేట్లు ఎత్తి నీరు దిగువకు విడుదల

ముదిగుబ్బ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యోగివేమన రిజర్వాయర్ (వైవీఆర్) పూర్తిగా నిండిపోయింది. దీంతో నీటిపారుదల శాఖాధికారులు గురువారం రాత్రి రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0.84 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 0.87 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 90 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో రిజర్వాయర్‌కున్న 11 గేట్లలో రెండింటిని ఎత్తి 3200 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ఐదుగంటలపాటు నీటిని విడుదల చేసి, తరువాత గేట్లను దించనున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ కృష్ణకుమార్ తెలిపారు.

నీటి ప్రవాహాల వద్దకు వెళ్లొద్దు

వైవీఆర్ నుంచి నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఇరిగేషన్ అధికారులు.. పరిశీలించారు. దిగువప్రాంతాలైన ఇందుకూరు, దొరిగిల్లు, మర్తాడు, కొడవండ్లపల్లి, నక్కలపల్లి, నాగలగుబ్బల, అడవిబ్రాహ్మణపల్లి, ఏబీపల్లి తండా, బండ్లపల్లి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం వద్దకు వెళ్లొద్దని సూచించారు. ముదిగుబ్బ-దొరిగిల్లు మధ్యనున్న కల్వర్టుపై నుంచి నీరు ప్రవహించనుంది. దీంతో కల్వర్టును ఎవరూ దాటే ప్రయత్నం చేయకుండా అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైసీపీ ప్రభుత్వ హయాంలో నం-2 ఎస్సీ హాస్టల్‌లో గోడచాటు నీడన లైన్లో నిలబడి భోజనం చేసేందుకు వెళ్తున్న విద్యార్థినులు


2024

పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో కళకళలాడుతున్న గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు





కొత్త వెలుగులు





నాడు-నేడుతో మాయ

వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టడంలో నాడు-నేడు పేరుతో మాయ చేసింది. జిల్లాలో 2019 నుంచి మరమ్మతులకు సంబంధించి నాడు-నేడు కింద ఉమ్మడి జిల్లాలో 150కిపైగానే వసతిగృహాలను ఎంపిక చేశారు. నిధుల సమస్యతో ఫేజ్-2 కింద ఎంపిక చేసిన వాటిని ఫేజ్-3కి బదలాయించారు. అక్కడ కూడా అవే కష్టాలు ఉత్పన్నం కావడంతో మరమ్మతులను అటకెక్కించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల దుర్భర పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేస్తామని ప్రకటించింది. ఈక్రమంలోనే జిల్లాలో బీసీ సంక్షేమశాఖకు సంబంధించి 32, ఎస్సీ సంక్షేమశాఖ 36, ఎస్టీ సంక్షేమశాఖలో రెండు హాస్టళ్లు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలలను మరమ్మతుల కోసం ఎంపిక చేసి నివేదికలు పంపారు. అవన్నీ చెత్తబుట్టకే పరిమితమయ్యాయి. ఇలా నిధులు లేకుండా కేవలం నివేదికలతో గత వైసీపీ ప్రభుత్వం సరిపెట్టి, సంక్షేమాన్ని నీరుగార్చింది.

మంత్రి సవిత చొరవ



బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సంక్షేమ హాస్టళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఉమ్మడి జిల్లా సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లతో సమావేశాలు నిర్వహిస్తూ... సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి స్వయంగా పలు హాస్టళ్లను పరిశీలించి... ఆయా సంక్షేమశాఖల అధికారులతో నివేదికలు తెప్పించుకొని వసతిగృహాల మరమ్మతుల కోసం నిధులు రాబడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు రూ. 20 కోట్ల దాకా నిధులను రాబట్టారు. వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు ఒక్కరంటే ఒక్కరు కూడా సంక్షేమ వసతగృహాల అభివృద్ధిని పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల చొరవతో సంక్షేమ వసతిగృహాలకు మహర్దశ పడుతోందని పలువురు సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కంటే మెరుగైన సంక్షేమాన్ని అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తోంది. ఈక్రమంలోనే తొలుత పింఛన్ల మొత్తాన్ని పెంచి బకాయిలతో చెల్లించి భేష్ అనిపించుకుంది. అలాగే వైసీపీ పాలనలో నిధులు లేక నీరసించిపోయిన సంక్షేమ వసతిగృహాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. వాటి స్థితి గతులు తెలుసుకుని, క్రమంగా మెరుగు చేయడానికి నిధులను సైతం విడుదల చేసింది. ప్రజాప్రతిధులు సైతం ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇక ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత దక్కించుకున్న సీఎం చంద్రబాబు ప్రస్తుతం వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ మహిళల జీవనోపాధుల పెంపుకోసం తపిస్తున్నారు. వైసీపీ పాలనలో మూసివేసిన అన్న క్యాంటిన్లను పునఃప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చుతోంది. ఏరకంగా చూసినా గత వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి సర్కారు ప్రజా సంక్షేమం కోసం మెరుగ్గా కృషి చేస్తోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే గత వైసీపీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన మధ్య తేడాలను ఎత్తి చూపుతున్నారు.

సంక్షోభాన్ని దాటి.. సంక్షేమం వైపు



స్వయం సహాయక సంఘాల మహిళలు

- నెలల వ్యవధిలోనే వైసీపీ కంటే మెరుగైన సంక్షేమం
- అన్ని వర్గాలకు పెరిగిన పింఛన్ మొత్తాలు
- సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు విడుదల
- డ్వాక్రా మహిళల స్వయం సమృద్ధికి చర్యలు
- పేదల ఆకలితీర్చే అన్న క్యాంటిన్ల పునఃప్రారంభం
- కూటమి ప్రభుత్వంపై పేద వర్గాల్లో కృతజ్ఞత

నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో వైసీపీ పాలనలో సంక్షేమ వసతి గృహాల్లో అంధకారం అలముకుంది. వసతి గృహ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా, పైకప్పు పెచ్చులూడిపడుతున్నా, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వసతిగృహాలను పట్టించుకోమని కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ఎన్నిసారు మొరపెట్టుకున్నా వారి వేదన అరణ్య రోదన అయ్యింది. ఫలితంగా పేదింటి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతిగృహాల అభివృద్ధికి రూ. కోట్లల్లో నిధులు విడుదల చేసింది. దీనిపై పలువురు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్/క్లాక్‌టవర్/అర్బన్

ఆరునెలల్లోనే అభివృద్ధి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే ఆయా వసతిగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. మొదటి నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన, సమస్యల నడుమ ఉన్న వసతిగృహాలకు సంబంధించిన నివేదికలను తెప్పించుకుంది. అనంత జిల్లాలో మొదటి విడతగా 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను ఎంపిక చేసింది. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ.1.85 కోట్లు విడుదల చేసింది. మూడు నెలల్లోనే ఆయా వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టింది. అలాగే జిల్లాలో శిథిలావస్థకు చేరి, సమస్యలతో సతమతమవుతున్న హాస్టళ్లను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను ఎంపిక చేశారు. ఇందులో 28 హాస్టళ్లకు మరమ్మతులు, మౌలిక వసతులు, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ. 3.67 కోట్ల అంచనా వ్యయంతో నివేదికలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 23 ఎస్సీ హాస్టళ్లలో సీలింగ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, పెయింటింగ్ సమస్యలు గుర్తించారు. వీటి కోసం దాదాపు రూ. 5.85 కోట్లు నిధులను కేటాయించగా పనులు ముమ్మరం చేశారు. తాజాగా మరోమారు ఆ జిల్లాలో మరో 10 వసతిగృహాలకుపైగా అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించగా వాటి కోసం రూ. 11.56 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

డ్వాక్రా మహిళల కోసం..

స్వయం సహాయక సంఘాల మహిళలు (డ్వాక్రా) జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు అందిస్తోంది. జిల్లాలో ఎస్సీ కేటగిరీలో 5,799 సంఘాల్లో 75,037మంది ఉండగా, ఎస్టీలో 1050సంఘాల్లో 15,846మంది, బీసీ కేటగిరిలో 24,237సంఘాలకు గాను 2,14,279మంది, ఓసీ కేటగిరిలో 4016సంఘాల్లో 61,644మంది, మైనార్టీ కేటగిరిలో 795సంఘాల్లో 12,627మంది మహిళలు ఉన్నారు. వీళ్లందరి అభివృద్ధి కోసం గతంలో కంటే కూటమి ప్రభుత్వంలో మెరుగైన పథకాలు తీసుకొచ్చారు. మహిళలకు పేదరికం నుంచి విముక్తి కల్పించి జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

సొంతింటి కల నెరవేర్చేలా...

ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. జగనన్న కాలనీల పేరిట స్థలాలు కేటాయింపు, లబ్ధిదారుల ఎంపిక, బిల్లులు చెల్లింపు వరకు అక్రమాలు జరగడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని అలాగే వదిలేస్తే కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు, నిధుల మంజూరుపై ప్రభావం పడే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే వైసీపీ పాలనలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు మన- ఇల్లు - మన గౌరవం పేరిట కార్యక్రమం చేపట్టింది. పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాల్లో శ్రీసత్యసాయి జిల్లాలో 5553 గృహ నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చికి పూర్తిచేయాలని లక్ష్యం పెట్టి నిర్మాణాలు చేయిస్తోంది.



అనంతపురంలోని బళ్లారి బైపాస్‌లో అన్న క్యాంటిన్‌కు కొత్త కళ



పింఛన్‌దారుల్లో ఆనందం

ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వంలో అత్యధికంగా లబ్ధిపొందినవారు పింఛన్‌దారులే. గత వైసీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తంలో పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అందిస్తూ ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచే పెంచుతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆమేరకు జూలై నెలలో పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలల బకాయిలను సైతం చెల్లించారు. జూలైకి సంబంధించి మొత్తం పింఛన్‌దారులు 2,89,995మందికి గాను పెంచిన సొమ్ముతో కలిపి రూ.127కోట్లు, బకాయిలు రూ.70.73కోట్లు మొత్తం రూ.197కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నెల నుంచే రూ.4000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యాంగులకు వైసీపీ ప్రభుత్వంలో చెల్లిస్తున్న రూ.3000లను కూటమి ప్రభుత్వం రూ.6000కు పెంచింది. పెరాలసిస్ బాధితులకు రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.15వేలకు పెంచింది. కిడ్నీ బాధితులు, థలసేమియా వంటి రోగులకు పింఛన్ మొత్తాన్ని రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.10వేలుకు పెంచింది. పింఛన్ పెంపు పట్ల ఆయా వర్గాల్లో సంతోషం, ప్రభుత్వం పట్ల కృతజ్ఞత వ్యక్తం అవుతోంది.



పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఆగిన నిర్మాణం

వంటింటికి వెలుగులు..



దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో పల్లె సింధూరరెడ్డి (ఫైల్)

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని నెలలకే రేషన్ కార్డు లబ్ధిదారులకు దీపావళి కానుక ఇచ్చింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా నవంబరు ఒకటి నుంచి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 536289 కనెక్షన్లకి ఉచితంగా సిలిండర్లు అందుతున్నాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు సిలిండర్ ధర బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటిన్

గత టీడీపీ పాలనలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్లు పేదల ఆకలి తీర్చేవి. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటిన్లను మూసివేసింది. దీంతో జిల్లా కేంద్రం, పట్టణ ప్రాంతాలకు పలు పనులపై వచ్చిన ప్రజలు, పట్టణంలో కూలి పనులు చేసుకొని బతికే నిరుపేదలు, భిక్షాటన చేసే వారు అన్నం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతకు ముందు నిత్యం వివిధ వర్గాల ప్రజలతో కళకళలాడిన క్యాంటిన్లు మందుబాబులు, అసాంఘిక వర్గాలకు అడ్డాగా మారాయి. అయితే మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటిన్లు పునఃప్రారంభమయ్యాయి. అనంతపురంలో మూడు అన్న క్యాంటిన్లు నడుస్తున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో ఒక్కోటి ఏర్పాటు చేశారు. ఈ క్యాంటిన్ల ద్వారా రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ పెడుతున్నారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్‌లో భాగంగా రోజు వారి షెడ్యూల్ మేరకు ఇడ్లీ, పూరి, పొంగల్, ఉప్మా పెడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో షెడ్యూల మేరకు వైట్ రైస్ తోపాటు పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు ఇస్తున్నారు. టిఫిన్, భోజనం ఏదైనా రూ.5లకే పేదలకు అందిస్తున్నారు. జిల్లాలోని ఒక్కో అన్న క్యాంటిన్‌లో ప్రతి రోజు 1000 మందికిపైగా టిఫిన్, భోజనం తింటున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు నెలలో అన్న క్యాంటిన్లను ప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీరుస్తోంది.



బళ్లారి బైపాస్‌లో వైసీపీ హయాంలో అన్న క్యాంటిన్ దుస్థితి

జనవరిలో జిల్లాకు కరువు అంచనా కమిటీ

ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరువు మండలాల్లో పరిస్థితుల అంచనాకు కేంద్ర మినిస్టీరియల్ కమిటీ జిల్లాకు రానుందని ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ శర్మ పేర్కొన్నారు. దీనిపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారుల తో ఇన్‌చార్జ్ కలెక్టరు గురువారం సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు కరువు మండలాలలో పర్యటించి, పరిస్థితులను అంచనా వేస్తారని తెలిపారు. జనవరి 2,3తేదీల్లో ఈ కేంద్ర కమిటీ వస్తుందన్నారు. ఈకమిటీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. 2024ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన ఏడు ప్రాంతాలను కరువు మండలాలుగా ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. కేంద్రకమిటీ కూడా అనంతపురంరూరల్, నార్పల, బుక్కరాయసముద్రం, రాప్తాడు, గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు మండలాల్లో పర్యటిస్తుందన్నారు. అక్కడ ఈకమిటీ కరువు పరిస్థితులను పరిశీలించి అంచనావేస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు పక్కా సమాచారాన్ని కమిటీకి చూపించాలని ఇన్‌చార్జ్ కలెక్టరు ఆదేశించారు. కమిటీకి వసతి, పర్యటనకు వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరువుకు సంబంధించిన పరిస్థితుల ఫొటోలను చూపించడానికి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్షపాతం, పంటలు తదితర అన్నిరకాల వివరాలు దగ్గర ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిటీ పర్యటన రూట్‌మ్యాప్, పోలీస్ బందోబస్తు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జలజీవన్‌మిషన్ పనులు, ఉపాధి పనులు, భూగర్భజలాల పరిస్థితులు కమిటీ దృష్టికి తీసికెళ్లాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, డీపీఎం ఆనంద్, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, గ్రౌండ్‌వాటర్ ఏడీ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-23 జట్టుకు జిల్లా క్రికెటర్ ఎంపిక



మహేంద్రరెడ్డి



కోచ్ బొమ్మన్న

అనంతపురం క్లాక్‌టవర్/తాడిపత్రి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-23 జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు మహేంద్రరెడ్డి ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో బీసీసీఐ అండర్-23 వన్డే టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున మహేంద్రరెడ్డి పాల్గొన్నాడు. ఇతడు తాడిపత్రి ఆర్డీటీ క్యాంపునకు చెందిన క్రీడాకారుడని ఏటీఎల్ లలిత గురువారం తెలిపారు. గతంలో అండర్-14, 16, 19లో పాల్గొని మంచి ప్రతిభ చూపాడని తెలిపారు. రాంచీలో జరిగే అండర్-23 పోటీల్లో ఆంధ్రాజట్టు తరఫున మహేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాకు చెందిన బొమ్మన్న ఆంధ్రా అండర్-23 మహిళా జట్టుకు ఎస్‌సి (స్ట్రెంత్ అండ్ కండీషనింగ్) కోచ్‌గా నియమితులయ్యారు. ఎంపికైన మహేంద్రరెడ్డి, బొమ్మన్నకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

విదేశీ భాషలతో ఉపాధి

ఎస్కేయూ వీసీ అనిత



ఆర్డీటీ ఫారిన్‌లాంగ్వేజ్ డిప్లొమా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విదేశీ భాషలతో(ఫారిన్ లాంగ్వేజ్‌లతో) నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగం లభిస్తోందని ఎస్కే యూనివర్సిటీ వీసీ అనిత తెలిపారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్‌లో ఫారిన్‌లాంగ్వేజ్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆర్డీటీ ప్రవేశపెట్టిన ఫారిన్‌లాంగ్వేజ్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణ, ఎస్కేయూతో పరస్పర ఒప్పందం చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఇందులో స్పానిష్, జర్మన్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వంటి ఫారిన్‌లాంగ్వేజ్ కోర్సులు ఉంటాయన్నారు. వీటికి ఎస్కేయూ ద్వారా శిక్షణ తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఓ వైపు టీచర్లకు, మరోవైపు నిరుద్యోగులకు ఫారిన్ లాంగ్వేజ్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందించడం, ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పీజీ డిప్లొమా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ నాగభూషణం రాజు, ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

మొబైల్ హెల్త్ వాహనం ఏర్పాటు చేయండి

ఐఓసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు ఎంపీ అంబికా వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జూనియర్ డాక్టర్ల బృందం మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేందుకు సీఎస్ఆర్ నిధుల నుంచి మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఐఓసీ) అనిల్ కుమార్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. గుంతకల్లు, అనంతపురం, గుత్తి, తాడిపత్రి రైల్వే స్టేషన్లల్లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలు (బుగ్గి) ఏర్పాటు చేయాలని కోరారు.

గుంతకల్లు డీఆర్ఎంగా సీఎస్ గుప్తా



గుంతకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజరుగా రైల్వే ఇంజనీరింగ్ శాఖకు చెందిన సీఎస్ గుప్తాను నియమిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విజయకుమార్ డీఆర్ఎంగా ఇక్కడ విధులను నిర్వర్తిస్తున్నారు. గత జూలైలో అవినీతి ఆరోపణలపై అప్పటి డీఆర్ఎం వినీత్ సింగ్‌ను సీబీఐ అరెస్టు చేయడంతో ఆయన స్థానంలో విజయకుమార్ తాత్కాలిక ప్రాతిపదికన డీఆర్ఎంగా గుంతకల్లు డివిజన్‌కు నియమితుడయ్యారు. విజయకుమార్ స్థానంలో బెంగళూరు మెట్రో రైల్ సర్వీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తున్న సీఎస్ గుప్తాను నియమిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను వెలువరించింది. త్వరలో ఆయన గుంతకల్లు డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

టమోటా కిలో రూ.12

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్య దర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలుతో అమ్ముడు పో యినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 14 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు ఉన్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 172 క్యూసెక్కులు వెళుతోందని వివరించారు. ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు.

శతాధిక వృద్ధుడి మృతి



కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయిలపల్లికి చెందిన నల్లబోతుల హనుమంతప్ప (101) అనే శతాధిక వృద్ధుడు గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ సంవత్సరం సెప్టెంబరు 18వ తేదీన వందవ పుట్టినరోజు వేడుకలను తన కుమారులు, మనవళ్లు, మునిమనవళ్లతో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. వంద సంవత్సరాలు ఉన్నప్పటికీ ఎంతో ఉల్లాసంగా వుండేవారని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

గోరంట్ల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహన్‌రావు కాలనీకి చెందిన 22యేళ్ల విద్యార్థిని అదృశ్యమైనట్లు గురువారం సీఐ శేఖర్ తెలిపారు. అనంతపురంలో బీఎస్సీ నర్సింగ్ మూడవ సంవత్సరం చదువుతోందని, సెలవుల నిమిత్తం స్వగ్రామం గోరంట్లకు వచ్చిం దన్నారు. ఈనెల 22వ తేదీ రాత్రి నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఇల్లే లేదు.. అప్పు ఎట్లా కట్టేది ?

ప్రశ్నిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు
రుణం చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి
ఎక్కడికక్కడ నోటీసులు జారీ చేస్తున్న వైనం
అయోమయంలో బాధిత వర్గాలు



అనంతపురం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంకా ఇల్లే అప్పగించలేదు. కానీ రుణం మాత్రం చెల్లించాలంటూ బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత టీడీపీ పాలనలో ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. లబ్ధిదారుల సంఖ్యను సైతం తగ్గించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16272మందికి ఇళ్లు కట్టించి ఇస్తామని మమ అనిపించింది. ఏళ్లు గడిచినా లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరలేదు. అంతలోనే బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా...

- టీడీపీ పాలనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సంఖ్య: 50,914
- వైసీపీ రద్దు చేసిన లబ్ధిదారుల సంఖ్య: 34,642
- రద్దు చేసిన లబ్ధిదారులకు చెల్లించాల్సిన నగదు: రూ. 33 కోట్లు
- వైసీపీ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిన వారి సంఖ్య : 16,272
- ఐదేళ్లలో కట్టించి అప్పగించిన లబ్ధిదారుల సంఖ్య: 370 మాత్రమే
- ఇంకా కట్టించాల్సిన టిడ్కో ఇళ్ల సంఖ్య : 15,902
- బ్యాంకర్లు నోటీసులు పంపించిన సంఖ్య : 50శాతం
- కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు: సుమారు రూ. 40 కోట్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంతే...

ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ పాలనలో 50,914ఇళ్లను మంజూరు చేయగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ వాటిని నిర్మించలేమని చేతులేత్తేసింది. 16,272 ఇళ్లను కట్టించి మిగిలిన 34,642మందికి సంబంధించిన (వారు చెల్లించిన నగదు) రూ. 33 కోట్లు వెనక్కి ఇస్తామని ప్రకటించింది. ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. లబ్ధిదారులకు డబ్బు చెల్లించలేదు, ఇళ్లూ కట్టించలేదు. గత ఐదేళ్లలో కేవలం 370 ఇళ్లను మాత్రమే అదీ కూడా 2024 ఎన్నికల ముందు హడావుడిగా పూర్తి చేసి సదరు లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన 15,092 ఇళ్ల పరిస్థితి మాత్రం నేటికి అగమ్యగోచరంగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం ఆగిపోయినట్లు అధికార వర్గాల సమాచారం. ప్రభుత్వాలు మారేయేగానీ.. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు మాత్రం తీరలేదు. ఇంతలోనే రుణం చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు జారీ చేయడంతో బాధిత వర్గాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

టిడ్కో ఇళ్ల పథకం అమలు తీరు ఇదీ...

టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.1 కి (300 చదరపు అడుగులు) కలిగిన సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు(దీనికి ఎలాంటి రుణం ఉండదు) 365 చదరపు అడుగులు కలిగిన సింగిల్ బెడ్ ఇల్లు కావాలనుకునే లబ్ధిదారుడు రూ. 25,000 చెల్లించాలి. బ్యాంకు రూ.3.15లక్షలు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వీటితో పాటు 430 అడుగులతో డబుల్ బెడ్ రూం కలిగిన ఇల్లు పరంగా.. లబ్ధిదారుడి వాటా రూ. 50,000 చెల్లిస్తే, బ్యాంకు రూ. 3.65లక్షలు రుణం ఇస్తుంది. మిగిలిన అమౌంట్ రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా టిడ్కో ఇళ్లకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఎంతో ఆశగా మధ్య తరగతి ప్రజలు నగదును చెల్లించి లబ్ధిదారులుగా చేరిపోయారు. అయితే వైసీపీ సర్కార్ టిడ్కో ఇళ్లను ఏమాత్రం పట్టించుకోలేదు.

మూడు నెలల నుంచి నోటీసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు గత మూడు నెలల నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. ఆయా లబ్ధిదారులకు సంబంధించిన సబ్సిడీ సొమ్ము తీసివేసి మిగిలిన రుణాన్ని చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో బ్యాంకర్లతో లబ్ధిదారులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు సైతం ఆ లబ్ధిదారుల అకౌంట్‌లను ఎన్‌పీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆ అకౌంట్ నుంచి లావాదేవీలు జరగకపోవడంతో బాధిత లబ్ధిదారులకు బ్యాంకింగ్ సేవల పరంగా అంతరాయం ఏర్పడుతోంది. టిడ్కో ఇల్లు తెచ్చిన తంట తమ బ్యాంకు సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ప్రధానంగా సిబిల్ స్కోర్‌పై ప్రభావం చూపడంతో భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50శాతం మందికి నోటీసులు జారీ చేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇప్పటికే నిర్మాణాలు ఆపేశారు.



అప్పట్లో ఇచ్చిన ధ్రువ పత్రాలతో వనజ

ప్రభుత్వానికి నివేదించాం

నోటీసుల విషయమై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదించాం. బ్యాంకర్లకు కూడా తగిన గడువు ఇవ్వాలని సూచించాం. ప్రస్తుతానికి నోటీసులు పంపకుండా ఉండాలని చెప్పాం. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు పనులు చేయడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం.

- సుధారాణి, టిడ్కో ఈఈ



ఇల్లే రాలేదు.. రుణం ఎలా చెల్లించాలి?: నాగేంద్ర, ఆదర్శనగర్

మాకు డబుల్ బెడ్ రూం (టిడ్కో) ఇల్లు మంజూరు కావడంతో నిబంధనలు ప్రకారం లబ్ధిదారుడి వాటాగా మొదట రూ. 50 వేలు చెల్లించాం. ఇంతవరకు టిడ్కో ఇళ్లు మాకు అప్పగించలేదు. బ్యాంకర్లు మాత్రం రుణం చెల్లించాలని నోటీసులు పంపారు. చెల్లించకపోతే బ్యాంకు అకౌంట్ ఎన్‌పీ చేస్తామని చెప్పి హోల్డ్ చేశారు. దీంతో బ్యాంకింగ్ సేవలు కూడా ఆగిపోయాయి. టిడ్కో ఇల్లే రాలేదు. అప్పుడే రుణం చెల్లించమంటే ఎలా? నేను ఆటో నడుపుకుంటూ నా భార్య, ఇద్దరు పిల్లలు పోషించుకుంటున్నా. మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.



రూ.50వేలు వెనక్కి ఇవ్వలేదు: వనజ

మాది రుద్రంపేట. నా భర్త ప్రైవేట్ ఉద్యోగి. నేను టైలరింగ్ చేస్తూ మా ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నాం. టీడీపీ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం రూ.50 వేలు డీడీల రూపంలో చెల్లించాం. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం మా టిడ్కో ఇంటిని రద్దు చేసింది. మేము చెల్లించిన నగదు వెనక్కి ఇస్తామని చెప్పింది. కానీ.. ఇంత వరకు ఇవ్వలేదు. నగదు చెల్లించి ఆరేళ్లవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా నగదు వెనక్కి ఇవ్వాలి. లేకుంటే టిడ్కో ఇల్లైనా మంజూరు చేసి న్యాయం చేయాలి.

సమర్థవంతంగా దేహదారుఢ్య పరీక్షలు

ఎస్పీ జగదీష్
పోలీస్ అధికారులు, ఐటీ కోర్ టీం సిబ్బందితో సమావేశం

అనంతపురం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు (స్టైపండరీ) దేహదారుఢ్య పరీక్షలు సమర్థవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లాలోని పోలీసు అధికారులు, జిల్లా పోలీస్ కార్యాలయం, ఐటీ కోర్ టీం సిబ్బందితో ఎస్పీ గురువారం స్థానిక పోలీస్‌కాన్ఫరెన్స్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, సిబ్బంది బాధ్యతలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జనవరి 17వరకు స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పురుష అభ్యర్థులు 5242, మహిళా అభ్యర్థులు 1237 మంది మొత్తం కలిపి 6479 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్‌లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్ఆర్‌బీ) ఆదేశాలు, నియమనిబంధనల మేరకు ఈ పరీక్షలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్ఎఫ్ఐడీ ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు(1600 మీటర్లు, 100మీటర్ల పరుగు, లాంగ్ జంప్), వెరిఫికేషన్-2(స్పెషల్ బెనిఫిట్స్, లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్సు కాపీలు వెంట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, నీలకంఠేశ్వర్‌రెడ్డి(ఏఆర్), జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రఘురాంనాయక్, సంబంధిత రిక్రూట్మెంట్ విభాగం క్లర్క్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లుగా నిత్యపోరాటం

సీపీఐ నేతలు



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్య పోరాటాలే వందేళ్లుగా సీపీఐని నడిపిస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐని స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా నగరంలోని పలు కాలనీల్లో, వాడల్లో పార్టీ జెండాలు రెపరెలపలాడాయి. కల్పనాజోషి కాలనీ, పాతూరు రాణి నగర్, చాకలి ఐలమ్మ కాలనీ, రాకెట్ల నారాయణరెడ్డి కాలనీ, బిందెల కాలనీ, పారతమ్మ కాలనీ, అనంతపురం రూరల్, నవయుగ కాలనీ ఇలా అనేక కాలనీల్లో స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి వందేళ్ల సీపీఐ వేడుకలను ఘనంగా చేశారు. సీపీఐ జెండాలు ఎగరవేసి...విప్లవ నినాదాలు చేశారు. తర్వాత కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ పతాకాన్ని జిల్లా కార్యదర్శి జాఫర్ ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ 1925లో డిసెంబరు 26న కాన్పూర్‌లో తమ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. అనేక పోరాటలతో నిత్యం ప్రజల్లో ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, జిల్లా కార్యవర్గసభ్యులు లింగమయ్య, నగర కార్యదర్శి శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్, ఇతరనాయకులు రవీంద్రనాథ్, అల్లిపీరా, రాజేష్, చెన్నకేశవులు, వరలక్ష్మి, భాగ్యమ్మ, కృష్ణుడు, చిరంజీవి ఇతర నేతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువతి మృతి

తనకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకాడపల్లికి చెందిన శ్రావణి (22) బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించింది. ఆమె బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. తండ్రి సత్యనారాయణ పెళ్లి చేసుకోమని చెప్పడంతో పెళ్లి ఇష్టం లేక ఈనెల 23న ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీకి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఆటో బోల్తాపడి బాలుడు...

డి.హీరేహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడి జగదీష్(12) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి గురువారం ఉదయం సొదట్టి యల్లమ్మ దేవి దర్శనం కోసం స్వగ్రామం నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఆటోను బాడుగకు తీసుకుని బయల్దేరాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బళ్లారి - రాయదుర్గం రోడ్డుపై కల్యం గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో గురుమూర్తి కుమారుడు జగదీష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ఉన్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జగదీష్ మృతి చెందాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుండి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కుమారుడి మృతితో గురుమూర్తి దంపతులు బోరున విలపించారు.

పాముకాటుతో మహిళ మృతి



సక్కుబాయి(ఫైల్)

యాడికి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందన గ్రామానికి చెందిన సక్కూబాయి(53) పాము కాటుతో మృతి చెందారు. పొలంలో పనులు చేస్తుండగా బుధవారం పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు అనుచితమని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ ప్లకార్డులు పట్టుకొని పెద్ద ఎత్తున కేంద్రమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత అక్కడ నుంచి ర్యాలీగా సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ డీఆర్వో మలోలకు వినతిపత్రం సమర్పించి, తమ డిమాండ్‌ను అధికారికంగా రాష్ట్రపతికి పంపి అమిత్ షాపై తగిన చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు, అనంతపురం ఇన్‌చార్జ్ దాదాగాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఈరన్న, రహంతుల్లా, జిల్లా కార్యదర్శి శీనా, తాడిపత్రి ఇన్‌చార్జ్ సూర్యనారాయణరెడ్డి, గుంతకల్లు ఇన్‌చార్జ్ మహేంద్ర పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

12 ద్విచక్రవాహనాల స్వాధీనం

బొమ్మనహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ అరెస్టు చేశారు. అతడి నుంచి 12 ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. ఈ వివరాలను గురువారం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన వీ సురేష్ బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు, నేమకల్లు, ఉద్దేహాళ్, కణేకల్లుక్రాస్, రాయదుర్గం పట్టణం, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణంలో దుకాణాల ముందు, దేవాలయ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేసే వాడన్నారు. నేమకల్లు క్రాస్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సురేష్ పట్టుబడినట్లు తెలిపారు. రూ.ఏడు లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేష్‌పై బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, కణేకల్లు, రాయదుర్గం, బళ్లారి ప్రాంతాల పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కో కేసు నమోదైనట్లు తెలిపారు. ఇతడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రాయదుర్గం సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన ద్విచక్రవాహనాలను చూపిస్తున్న పోలీసులు

ఇద్దరు దొంగల అరెస్టు

15 ద్విచక్రవాహనాలు, బంగారం స్వాధీనం

గుంతకల్లు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలు, ద్విచక్రవాహనాలను అపహరించిన ఇద్దరిని కసాపురం పోలీసులు అరెస్టు చేశారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు కేసు వివరాలను గురువారం సాయంత్రం వెల్లడించారు. పట్టణంలోని మస్తాన్ పేటకు చెందిన బీ రఘు, ఉమామహేశ్వర నగర్‌కు చెందిన షెక్షావలిని అదుపులోకి తీసుకుని విచారించగా, వీరు ఇళ్లల్లోనూ, ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన కేసుల్లో నిందితులుగా గుర్తించామన్నారు. రఘు నుంచి 14 ద్విచక్రవాహనాలు, షెక్షావలి నుంచి ఒక బైక్, 27 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితులను రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణంలో జరిగిన దొంగతనాలు, బైక్‌ల తస్కరణపై నిఘా పెట్టి నిందితులను పట్టుకున్న కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి, సిబ్బంది సుంకన్న, జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వర రావు, భూపతి, అంజి, నూర్ మహమ్మద్‌ను డీఎస్పీ ప్రశంసించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టీపీ వెంకట స్వామి, సిబ్బంది

ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతల నుంచి తొలగింపు

అనంతపురం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ఇద్దరు ఏఈలకు గతంలో ఇచ్చిన ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు తొలగిస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా డీఈఈ స్థానాలను మరో ఇద్దరు రెగ్యులర్ డీఈఈలకు అప్పగించారు. ఉరవకొండ పీఐయూ ఏఈగా పని చేస్తున్న తిరుపాల్‌ను గతంలో శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిర పీఐయూ ఇన్‌చార్జి డీఈఈగా నియమించారు. జిల్లాలోని తాడిపత్రి పీఆర్ఐ సబ్ డివిజన్‌లో యాడికి ఏఈగా పనిచేస్తున్న యల్లంనాయుడికి అదే సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు అప్పగించారు. అయితే అదే శాఖలో పనిచేస్తున్న ఓ ఏఈ సీనియారిటీని పాటించకుండా ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు అప్పగిస్తున్నారని హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ ఇద్దరు అధికారులను ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతల నుంచి తొలగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. గుత్తి డీఈఈగా పనిచేస్తున్న డీఎల్ మురళీధర్‌కు తాడిపత్రి డీఈఈగాను, హిందూపురం డీఈఈగా పనిచేస్తున్న మల్లికార్జునకు మడకశిర డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఈఈల బాధ్యతల తొలగింపుతో ఆ ఇద్దరు ఏఈలు తమ పాత స్థానాల్లో పనిచేయాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లోనే పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్ ...

నేడు దొన్నికోటలో రెవెన్యూ సదస్సు

నల్లమాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోటలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దొన్నికోట పంచాయతీలోని ప్రజలు, రైతులు సమస్యలపై వినతులు సమర్పించాలని, వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

శ్మశాన వాటిక కోసం స్థల పరిశీలన

నంబులపూలకుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను పంచాయతీ పరిధిలోని హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని గురువారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి అనుకూలంగా ఉన్న ఎద్దులగుట్టను పరిశీలించారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఈభూమిని శ్మశాన వాటికగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. వారి వెంట సర్పంచ్ విష్ణుమూర్తి, సర్వేయర్ జిలాన్, బీజేపీ నాయకులు జయరాం ఉన్నారు.

కళాశాలకు విరాళం


ప్రిన్సిపాల్‌కు చెక్కు అందజేస్తున్న అశోక్‌పడపాటి

కొత్తచెరువు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వంటసామగ్రి కోసం వదన్యా ఫౌండేషన్ నిర్వాహకుడు అశోక్ పడపాటి రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఆ చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్రారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కొత్తచెరువు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, భవన నిర్మాణంపై ఆధారపడి జీవిస్తున్న అసంఘటిత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ, సీఐటీయూ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కరెంటు చార్జీలు పెంచబోమని.. పెరిగిన ధరలను తగ్గిస్తామని.. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని తుంగలో తొక్కి.. చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఎస్ వెంకటేశ్, సీపీఐ నాయకులు బ్యాళ్ల అంజి, ముత్యాలు, శంకరరెడ్డి, ఐద్వా నేత నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మండలపూజ


మండల పూజ నిర్వహిస్తున్న గురుస్వామి

ధర్మవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లో ధర్మశాస్త్ర అయ్యప్ప మండల పూజ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి విజయ్ కుమార్ అయ్యప్పస్వామి చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప భజనలు చేశారు. మాలధారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు భిక్ష పెట్టారు.

సురేష్‌కుమార్‌కు సేవారత్న అవార్డు

పుట్టపర్తిరూరల్ డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వినియోగదారులను చైతన్య పరచడంలో విశేష కృషి చేసిన రాష్ట్ర వినియోగదారులు సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌కు వినియోగదారుల సేవారత్న అవార్డు దక్కింది. ఈ మేరకు పుట్టపర్తికి చెందిన సురేష్‌కుమార్‌కు విజయవాడ తుమ్మళపల్లి కళాక్షేత్రంలో మంత్రి నాదెళ్ల మనోహర్ గురువారం ఆ అవార్డు అందజేశారు. సురేష్ మాట్లాడుతూ.. అవార్డు రావడంలో తనకు మద్దతు పలికిన వినియోగదారుల వ్యవహారాల శాఖ కమిషనర్, కలెక్టర్, జిల్లా వినియోగదారుల సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సురేష్‌కుమార్

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కెనడా దేశానికి చెందిన భక్తులు ఆలపించిన పాటలు అలరింపజేశాయి. పర్తియాత్ర పేరుతో వందలాది మంది కెనడా భక్తులు గురువారం స్థానిక ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో కచేరి నిర్వహించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలతో సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ కెనడా అధ్యక్షుడు అరుణసువేంద్రన్ ఆ దేశంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


పాటలు పాడుతున్న కెనడా భక్తులు

పట్టాలకే పరిమితం..!

- హీనస్థితిలో ఎన్పీకుంట జగనన్న కాలనీ
- 240 పట్టాల పంపిణీ
- ఒక్క ఇంటినీ మంజూరు చేయని వైనం
- ఏపుగా పెరిగిన కంపచెట్లు
- ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలోనే..

నంబులపూలకుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామంటూ.. గత వైసీపీ ప్రభుత్వం ఏకంగా కాలనీలనే ఏర్పాటు చేసింది. అయితే మండల కేంద్రంలో ఏ ఒక్కరికీ ఇంటిని మంజూరు చేయలేదు. అంతేకాకుండా ఒకొక్కరికి ఒకటిన్నర సెంటు స్థలం మంజూరు చేయడం.. అనువుగానిచోట స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇంటి నిర్మాణం ఆసక్తి చూపలేదు. దీంతో సొంతింటి కల.. కలగానే మిగిలిపోయింది.

మండలకేంద్రంలో ప్రభుత్వ భూమి పట్టాలివ్వడానికి అనుకూలంగా లేకపోవడంతో అప్పట్లో సోలార్ ప్రాజెక్టుకు ఇచ్చిన భూమిని తిరిగి ప్రభుత్వం వెనకు తీసుకుంది. ఆ భూమిలో పేదలకు 240 పట్టాలిచ్చింది. ఒక్కరికీ ఇంటిని మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులు కూలీ నాలి చేసుకుని అద్దె ఇళ్లలోను ఉంటున్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. లేఅవుటుకు వెళ్లే రహదారికి మాత్రం సీసీ రోడ్లు వేశారు. పట్టాలిచ్చిన చోట మాత్రం ఒక్క పునాది రాయి కూడా వేయలేదు.

● ఉచిత ఇసుక లేదు ..

గత వైసీపీ పాలనలో ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందే పరిస్థితి లేదు. ట్రాక్టర్ ఇసుక కోసం రూ.5 వేలు ఖర్చు చేయాల్సి ఉండేది. అలాగే ఇనుము, ఇటుకల ధరలు కూడా విపరీతంగా ఉండేవి. దీంతో ఇళ్లు కట్టుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు.

● కూటమిపై ఆశలు..

మండల వ్యాప్తంగా మొత్తం 420 పట్టాలను వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. మరికొమ్మెదిన్నె, బలిజపల్లి, మేకలచెరువు, ఎదురుదొన లేఅవుట్లలో ఒక్క పునాది రాయి కూడా పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడంతో విరివిగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే మండల వ్యాప్తంగా 460 దరఖాస్తులు వచ్చినట్లు గృహనిర్మాణాధికారులు తెలిపారు.

అర్హుల జాబితా పంపాం

మండలంలోని అర్హులైన 460 మంది జాబితాలను తయారు చేసి, ప్రభుత్వానికి పంపాం. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు బిల్లులు రాక వివిధ దశల్లో ఆగిపోయాయి. వారి జాబితానూ తయారు చేసి పంపాం.

- శ్రావణి, హౌసింగ్ ఏఈ, నంబులపూలకుంట


ఎన్పీకుంట జగనన్న లేఅవుట్‌లో ఏపుగా పెరిగిన కంపచెట్లు

అద్దె ఇంట్లో ఉంటున్నాం



చిన్నవ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. సొంతింటి కోసం ఎనిమిది ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇళ్లు మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాం.

- శశికళ, నంబులపూలకుంట

నాడు ధరలు అధికం



వైసీపీ పాలనలో అన్ని ధరలు బాగా పెరిగాయి. ఇసుక, ఇటుకలు, సిమెంటు, ఇనుము.. ఇలా అన్నీ. ప్రస్తుతం ఉచితంగా ఇసుక దొరుకు తోంది. అలాగే ఇటుకలు, సిమెంటు ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

- హసీనా, నంబులపూలకుంట

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ స్థాపించి.. వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పార్టీ జెండా ఆవిష్కరించారు. స్థానిక మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణమండపం నుంచి గాంధీసర్కిల్, ఎన్టీఆర్, కళాజ్యోతి, బస్టాండ్ సర్కిల్ మీదుగా తిరిగి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నకలరాజ పాల్గొన్నారు.

● నల్లమాడ: స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటరమణ, కుచ్చెపు చంద్ర, రామాంజి, సూరీ, గంగాధర్, ఆదినారాయణ,ఆ దిలక్ష్మమ్మ, రామక్క, కేశప్ప పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: స్థానిక బస్టాండ్ సమీపంలో జెండాను ఆవిష్కరించి.. కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరెడ్డి, రమణ, అమీర్‌బాషా, ఆదిలక్ష్మమ్మ, రాజారెడ్డి, గంగులప్ప పాల్గొన్నారు.

● తనకల్లు: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ నాయకులు కేక్‌ను కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, చౌడప్ప యాద్, ఇక్బాల్, ఆనంద్, రవినాయక్, రవికుమార్,మల్లికార్జున, శ్రీనివాసులు, చలపతి, రెడ్డెప్ప, సుగుణమ్మ, అనసూయమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక సీపీఐ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి చలపతి, నాయకులు సుధాకర్, రామచంద్ర, రవి, రత్నమ్మ, రమణమ్మ, దేవేంద్ర, వెంకటేష్, ఆంజనప్ప, లక్ష్మీనర్సు పాల్గొన్నారు.



ధర్మవరం : ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రోడ్లపై మురుగు నీరు

ధర్మవరం రూరల్/ఓబుళదేవరచెరువు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లపైనే మురుగునీరు పారుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం పట్టణంలోని మాధవ నగర్‌లోని బలిజ కళ్యాణ మండపం సమీపంలోని మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతోంది. రోడ్డు పక్కనే నిల్వ ఉంటోంది. అలాగే ఓబుళదేవరచెరువులో అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎస్బీఐకు ఉన్న రహదారిపై కూడా మురుగు నీరు ప్రవహిస్తోంది. అలాగే మురుగునీరు నిల్వ ఉంటుండటంతో దోమల ప్రభావం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మురుగునీరు రోడ్లపై పారకుండా.. నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ధర్మవరం మాధవనగర్‌లో, ఓడీసీలో రోడ్డుపై నిల్వ ఉన్నమురుగునీరు

నాటి వైభోగమేదీ..?

- నిర్లక్ష్యం నడుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం
- పది ఎకరాల మాన్యమున్నా.. నిష్ప్రయోజనం
- ధూపదీపాలకూ నోచుకోని వైనం
- కాలగర్భంలో కలిసిపోతున్న ప్రాచీన గుడి

నల్లమాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ యనుముల వారిపల్లి సమీపంలో ఉన్న దేవరగుళ్ల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం... ఒకప్పుడు నిత్యం పూజలతో కళకళలాడేది. నిత్యారాధనలు, దూప దీప నైవేద్యాలతో వెలిగిపోయేది. శుభాకార్యాలు, పెళ్లిలు నిత్యం జరిగేవి. అయితే పదేళ్లుగా ఈ ఆలయం నిరాదారణకు గురవుతోంది. కొన్నేళ్లుగా ఈ ఆలయాన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. కదిరిలోని శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నిర్మాణం కంటే ముందే దేవరగుళ్లలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. ఈ ఆలయం ప్రస్తుతం దూపదీప, నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఆలయంలో దీపారాధన కోసం నూనె ఇచ్చే దాతలు కూడా కరువయ్యారు. ప్రస్తుతం ఈ ఆలయంలో పూజా రి కూడా లేదు. స్వామి వారు దూప దీపనైవేద్యాలకు నోచుకోవడం లేదు. ఆలయానికి సమీపంలోని నల్లగొండ యనుముల వారిపల్లి గ్రామానికి చెందిన కుటాల గంగప్ప పదేళ్ల నుంచి ఆలయంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తున్నారు. ఆలయం నిర్వాహణ కోసం పదిఎకరాల భూమి ఉంది. ఈ మాన్యంలో గతంలో చింత-నిశ్చింత కింద మొక్కలు నాట్టారు. ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో ఆ మొక్కలు ఎండిపోయాయి. ప్రస్తుతం పది ఎకరాల మాన్యం భూమిలో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ మాన్యంలో ఆయా గ్రామీణులు చౌరవ తీసుకుని పంటలు సాగుచేస్తే.. ఆ ఆదాయంతో కనీసం ఆ ఆలయంలో దీపారాధనలు జరిగే అవకాశముంటుందని భక్తులు సూచిస్తున్నారు. ఆలయం వెనుక భాగంలో ఓ చలిమి ఉంది. వేసవి, అనావృష్టి సమయంలో కూడా నిత్యం అందులో నీరు ఉంటుంది. గతంలో ఈ ఆలయం వద్ద యోగులు, సాధువులు, ఆవాసాలు ఏర్పాటు చేసుకొని నివాసముంటేవారు. స్వామిని పూజ చేసుకుని, ధ్యానం చేసుకొనేవారు. ప్రస్తుతం ఇక్కడ ఎవరూ ఉండటం లేదు. గతంలో శ్రీవారి వెండి గొడుగులు చోరైనట్లు సమాచారం. కదిరి, నల్లమాడ ప్రధాన రహదారి నుంచి ఆలయం దగ్గర వరకు తార్ రోడ్డు ఉంది. అక్కడ నుంచి గుడికి వెళ్లే నడకదారి చాలా అధ్వానంగా ఉంది, వృద్ధులు, చిన్నారులు గుడికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి వెనుక భాగంలో అక్కదేవతల గుడి కూడా ఉంది. ఆ గుడిలో అక్కదే వతలు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రస్తుతం అక్కదేవతలకు కూడా పూజలు కరువయ్యాయి.

ఆలయానికి సంబం ధించిన నాలుగైదు గ్రామాల వారు ఉన్నారు. ఏ గ్రామం వారూ కూడా ఆలయంలో దీపారాధన చేయడానికి సాయం చేయడం లేదు. ప్రస్తుతం చెండ్రాయునిపల్లి గ్రామానికి చెందిన బయ్యమ్మగారి క్రిష్ణారెడ్డి కుటుంబం, బత్తపల్లి గ్రామానికి చెందిన రంగారెడ్డి, రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ఆలయంలో దీపారాధన కోసం ఆముదం నూనెను ఇస్తున్నారు. ఇలా నిరాదారణకు గురైన ఈ ప్రఖ్యాతి గాంచిన ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేలా పాలకులు చర్యలు తీసుకోవాలని, ఆలయం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.


ఎగుడుదిగుడుగా ఉన్న కాలినడక దారి, నరసింహస్వామి విగ్రహం (ఇన్‌సెట్లో..)


ఆలయం వద్ద ఉన్న చెలిమె


శిథిలావస్థలో ఉన్న ఆలయం


అలంకరణలో అక్కదేవతలు

వ్యాన్ బోల్తా

బత్తలపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లమర్రి వద్ద అదుపుతప్పి వ్యాన్ గురువారం బోల్తా పడింది. ప్రమాదంలో బాగేపల్లికి చెందిన డ్రైవర్ శివప్ప, క్లీనర్ నాగేష్ గాయపడ్డారు. బత్తలపల్లిలోని రైస్ మిల్లులో వరిపొట్టు తీసుకొని బాగేపల్లికి వెళ్తుండగా.. పొట్లమర్రి వద్దకు వెళ్లగానే వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో శివప్ప, నాగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్‌ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ కడప జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఎన్‌ఎంయూఏ పుట్టపర్తి డిపో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయక ముందు ఉన్నటు వంటి అపరిమిత, వైద్య సౌకర్యాలను కొనసాగించాలని, పాత పింఛన్ స్కీమ్‌ను పునరుద్ద రించాలని కోరారు. అలాగే కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, మెకానిక్ గ్యారెజీలో సాంకేతికకు అనుగుణంగా నూతన పనిముట్లు సరఫరా చేయాలని కోరారు. విజయవాడలో నిర్మిస్తున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యాలయానికి కార్మికులందరూ సమకరించాలన్నారు.

● కమిటీ ఏకగ్రీవం : పుట్టపర్తి ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూఏ కమిటీని గురువారం ఎన్నుకు న్నారు. పుట్టపర్తి డిపో గౌరవాధ్యక్షుడిగా రామలక్ష్మణ్, ఛైర్మన్‌గా ఈశ్వరయ్య, అధ్యక్షుడిగా శివశంకర్, కార్యదర్శిగా గంగులయ్య, ట్రెజరర్‌గా శివారెడ్డి, గౌరవ సలహాదారుడిగా అప్పిరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సమావేశంలో ఎన్‌ఎంయూఏ నాయకులు రవితేజ, చెంద్రాయుడు, గయాజ్‌బాషా, నూర్‌మహమ్మద్, తిరుపతమ్మ, బాబ్‌జాన్, రవీంద్ర, నారాయణ, రాజగోపాల్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఘనంగా వీరబాల దివస్


మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు

ధర్మవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బీజేవైఎం యువమోర్చా ఆధ్వర్యంలో వీరబాల దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్, ఆయన కుటుంబం.. దేశం, మతం, ధర్మం రక్షణ కోసం చేసిన త్యాగాలను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, వీరబాల దివస్ కార్యక్రమం జిల్లా కో కన్వీనర్ కుళ్లాయప్ప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ఎంపీ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో వీరబాల దివాస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బాబా గురు గోవింద్‌సింగ్, అతని తనయుడు బాబా జోరావర్‌సింగ్, బాబాఫతే సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువమోర్చ నాయకులు నరేష్‌బాబు, సురేష్, నాగప్ప, ఉపాధ్యాయులు సునితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేయండి

కదిరి అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేరు వద్ద ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపం శిథిలావస్థకు చేరుకుందని, దానికి మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేయాలని స్థానిక ప్రముఖులు చేస్తున్నారు. ఈ మేరకు గురు వారం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన సర్వే యర్ రేరాజు సియోధర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కళ్యాణమండపం నిర్వాహణ లోపం వల్ల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, చిన్నపాటి మరమ్మ తులకూ నోచుకోవడం లేదన్నారు. స్పందించిన సర్వేయర్ కళ్యాణ మండపం సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తతాను. కార్యక్రమంలో జనసేన పట్టణ ఉపాధ్యక్షుడు కుటాల లక్ష్మణ్, బీజేపీ శరత్‌కు మార్‌రెడ్డి, హరినాథ్‌నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెనుకొండలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాలనీలో గురువారం డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన సమరయోధులకు నివాళులు అర్పించారు.

సోమందేపలి: సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ నాయకులు మండలకేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి బాలాస్వామి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటంచేసి ఎందరో ప్రాణ త్యాగం చేశారన్నారు. అనంతరం సీపీఎం జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, తిమ్మయ్య, అంజినప్ప, నూర్‌జహాన్, గంగప్ప, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఐదుకళ్లు సదాశివనగర్‌లో వేడుకలను నిర్వహించారు. మండల కార్యదర్శి శివప్ప, సీపీఐ జెండాను ఎగురవేసి వేడుకలను జరుపుకున్నారు.

మడకశిర టౌన్: మడకశిర పట్టణంలో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి ఆర్.జి.పవిత్ర, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం అదిరెడ్డిపాళ్యం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ శ్రీనివాస్‌బాస్కర్ పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, శివన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డు భూములకు హక్కులు కల్పిస్తాం



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ సువర్ణ

గోరంట్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డు భూములకు సంబంధించి డీపట్టా కలిగి పాస్‌పుస్తకం పొందిన వారికి వాటిని విక్రయించే హక్కు కల్పిస్తామని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. మండలంలోని బూదిలి గ్రామంలో గురువారం జరిగిన రెవిన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. 20ఏళ్ల అనుభవం కలిగినవారు భూమిని విక్రయించకపోతే వారి వారసులకు అమ్మడానికి హక్కు కల్పిస్తామన్నారు. ఎస్సీ నరసింహప్ప తన విలువైన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి, ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీఓ స్వయంగా అతని పొలాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా 70 మంది వివిధ సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, సర్వేయర్ తాతాయ్య, విఆర్ఓలు సల్మాన్, అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండలపూజ

గోరంట్ల,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సినిమా థియేటర్, ఆర్టీసి బస్టాండ్ వీధిలోని అయ్యప్పస్వామి సన్నిధానాల్లో గురువారం ఘనంగా మండలపూజ నిర్వహించారు. గురుస్వాములు ఆదినారాయణ, తిప్పన్నస్వామి ఆధ్వర్యంలో విడివిడిగా పడిపూజ జరిపారు. టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేయగా, కన్వీనర్ సోముశేఖర్ అయ్యప్ప మాలధారులకు భోజనాన్ని వడ్డించారు. మండల పూజ వేడుకలలో మంత్రి భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరావు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా కనకదాస జయంతి

సోమందేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చన్నాపురం గ్రామంలో భక్త కనకదాస జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రవి, దేవేగౌడ, కిష్టప్ప, హనుమంతులు మాట్లాడుతూ ప్రతియేటా ఆనవాయితీగా కనకదాస జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. కురుబల ఆరాధ్యదైవమైన కనకదాస ఔన్నత్యాన్ని, విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో కురుబ కులస్థులు భారీగా పాల్గొన్నారు.

చోరీల నుంచి రక్షణపై అవగాహన

సోమందేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'చోరీల నుంచి రక్షణ ఎలా?' అనే అంశంపై గురువారం ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యాంటి థెఫ్ట్ అలారంలాక్ ద్వారా డెమో ఇచ్చి శిక్షణ ఇచ్చారు. గృహనిర్మాణ యజమానులు తామూ ఊరికి వెళ్లాల్సి ఉంటే ఇళ్లకు ఇలాంటి లాక్‌లు వేయడంద్వారా దొంగల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. అలాగే ద్విచక్రవాహనాలకు సైతం ఈ లాక్‌లను వినియోగించవచ్చునన్నారు. బ్యాటరీతో పనిచేసే ఈ లాక్‌వల్ల రివర్స్‌చేస్తే బీప్ అంటూ శబ్దం వస్తుందన్నారు. అనంతరం ఆ లాక్‌ను కత్తిరించినా, పగలకొట్టాలని చూసినా పెద్ద శబ్దం వస్తుందన్నారు. దీంతో ఆ శబ్దానికి దొంగలు పరారవుతారన్నారు. ప్రజలు వీటిని విరివిగా ఉపయోగించడం వల్ల దొంగతనాలను అరికట్టవచ్చన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ



పులమతిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లేపాక్షి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల సమాజంలో ప్లాస్టిక్ వాడకం అధికమైందని దీనివల్ల వాతావరణంలో పలు సమస్యలు ఏర్పడుతున్నాయని పులమతిలో పాఠశాల హెచ్ఎం సుబ్బారావు ఆందోళన వ్యక్తంచేశారు. అందుకు వ్యతిరేకంగా గురువారం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రహదారి పక్కన ఉండే ప్లాస్టిక్‌వ్యర్థాలను శుభ్రం చేశారు.

రేషం షెడ్ల వరండాల సబ్సిడీ కలేనా?



● నాలుగు సంవత్సరాలైనా అందని బిల్లులు
● వరండా నిర్మాణానికి రూ.30వేలు సబ్సిడీ ఏమైంది?
● కార్యాలయాల చుట్టూ మల్బరీ రైతుల ప్రదక్షిణ

మడకశిర, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రేషం షెడ్లకు వరండాలు నిర్మించుకుంటే సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి నాలుగేళ్లయినా ఇంతవరకూ దానికి అతీగతీలేదు. నాలుగు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం (ఆర్‌కెవివై) రాష్ట్రీయ విశాన్ వికాశ్ యోజన పథకం కింద రూ30వేల రూపాయిల సబ్సిడీని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్డుకు వరండా నిర్మించుకునేందుకు లక్ష రూపాయిల దాకా ఖర్చవుతుంది. శ్రీసత్యసాయి జిల్లా లో 500 షెడ్లకు వరండాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారుల సమాచారం. నాలుగు సంవత్సరాలలో నియోజకవర్గంలోని రొళ్ళ, అగలి. గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలలో దాదాపు 80 మంది దాకా రైతులు మల్బరీ షెడ్డుకు వరండాలు నిర్మించుకున్నారు. పెద్ద షెడ్డుకు రూ.30వేలు చిన్న షెడ్డుకు రూ.22 వేల సబ్సిడీని మంజూరు చేశారు. షెడ్డుకు వరండా నిర్మించుకుంటే ఎండతగలకుండా ఉంటుందని, గూళ్ళ దిగుబడి బాగా వస్తుందని రైతన్నలు అప్పు చేసి షెడ్డుకు వరండాలు నిర్మించుకున్నారు. నిర్మించుకుని నాలుగు సంవత్సరాలవుతున్నా బిల్లులు మాత్రం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజక వర్గంలో రైతులు వేరుశనగ పంట తరువాత అధికంగా మల్బరీ పంట సాగు పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎండవేడి వలన దిగుబడి లేక పంటలు దెబ్బతిని రైతన్నలు నష్ట పోయారు. దీంతో ఎండ వేడిమి నుంచి పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి రైతులు రేషం షెడ్లకు వరండాలు నిర్మించుకున్నారు. వాటి నిర్మాణం పూర్తయి నేటికి నాలుగేళ్లయినా సబ్సిడీ అందించక పోవడంతో వడ్డీ చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే సబ్సిడీని చెల్లిస్తాం: కే.రాజు, ఏడీ

మల్బరీ షెడ్లకు వరండాలు నిర్మించుకునేందకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవివై కింద రూ.30వేల రూపాయిల సబ్సిడీ ఇస్తానని ఉత్తర్వులిచ్చింది. నిధులు మంజూరు అయిన వెంటనే రైతులకు సబ్సిడీ మొత్తం చెల్లిస్తాం.

వరండాల సబ్సిడీ వెంటనే చెల్లించాలి



అప్పుచేసి మల్బరీ షెడ్డుకు వరండా నిర్మించుకుని నాలుగు సంవత్సరాలయింది. ఇందుకు రూ.1.5లక్షలు ఖర్చయింది. ప్రభుత్వం అందించేది రూ.30 వేలు మాత్రమే అయినా అప్పు చేసి వరండా నిర్మించుకున్నాం. చేసిన అప్పుకు వడ్డీ చెల్లిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం వరండా నిర్మించుకునేందుకు మంజూరు చేసిన సబ్సిడీని పూర్తిగా చెల్లించాలి. -హనుమంతరెడ్డి, రైతు, మడకశిర

మార్కెట్లో టమోటా ధర ఢమాల్

● కిలో రూ.10 పలుకుతున్న వైనం
● గిట్టుబాటు లేక రైతులకు తీవ్ర నష్టం

చిలమత్తూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమోటా ధర రూ.10లు పలుకుతోంది. పదిహేను రోజుల క్రితం వరకు కిలో ధర రూ.60 వరకు పలికింది. దాంతో రైతులకు టమోటా రైతులకు మంచి ధరే లభించింది. కానీ ఉన్నట్టుండి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పంట దిగుబడి బాగా పెరగడం, వాతావరణం అనుకూలంగా ఉండ



టంతో మార్కెట్లోకి టమోటాలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. దాంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో మార్కెట్లోకి రావాల్సిన దానికంటే సరుకు ఎక్కువగా వస్తుండటంతో ధరలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇప్పుడు పంట సాగుచేస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 150 ఎకరాల వరకు టమోటా సాగవుతోంది. ఇప్పుడిప్పుడే పంట కోతకు వచ్చి మార్కెట్‌కి కాయలను తరలిస్తున్నారు. ఈ తరుణంలో ధర పడిపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి కనపడలేదని రైతులు వాపోతున్నారు.

పురుగు మందులు, ఎరువులకే ఎక్కువ ఖర్చు..

టమోటా పంట నాటినప్పటి నుంచి పంట చివరి వరకు నిత్యం సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. గతంలో లాగా సస్యరక్షణ చర్యలు వేగంగా తీసుకోకపోతే పంట పూర్తిగా వదులుకోవాల్సి వస్తుంది. దీంతో నారు నాటిన వారం నుంచి పురుగు మందులు, ఎరువుల వినియోగం అధికంగా ఉంటోంది. వీటి ధరలు మార్కెట్లో విపరీతంగా ఉంటున్నాయి. దీని కారణంగా పంట సాగులో పురుగు మందులు, ఎరువుల పెట్టుబడులే ఎక్కువగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పంట బాగా పండాలంటే ఎకరం పొలానికి రూ. లక్షకు పైగా ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఖర్చులు అధికం.. రాబడి తక్కువ

ఉన్నట్టుండి ధర పడిపోవడంతో టమోటాలను కోసి మార్కెట్‌కి తరలించే ఖర్చులే అధికమవుతున్నాయి. ఎకరం పంటను కోసి మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఏకంగా రూ. 3000 వరకు ఖర్చు అవుతోంది. మంచి నాణ్యతతో ఉన్న 15 కిలోల టమోటా బాక్స్ కేవలం రూ. 120 నుంచి రూ. 140 వరకు పలుకుతోంది. అందులోను మార్కెట్ కమీషన్, బాక్సుల అద్దె, రవాణా ఖర్చులు పోను బాక్సుకి కేవలం రూ. 100లు మాత్రమే రైతుకి మిగులుతోంది. దాంతో కిలోకి పది రూపాయలు దక్కుతోంది. ఈ పరిస్థితుల్లో ఖర్చులు పెరుగుతుండగా, రాబడి పూర్తిగా తగ్గిపోయింది. మరికొన్ని రోజులు మార్కెట్లో టమోటా ధరలు ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోవడం ఖాయమని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి ఖర్చులు దక్కడం కూడా కష్టమే



మార్కెట్లో ధరలు పడిపోవడంతో పంట సాగుకు పెట్టిన ఖర్చులు కూడా రావడం కష్టంగా ఉంది. ఎకరం పంట సాగుచేస్తే సుమారు రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. మార్కెట్లో కాయలు ఎక్కువగా వస్తున్న కారణంగా ధరలు పడిపోయాయి. పంటను పారేసుకోలేక నష్టమైనా మార్కెట్‌కి తీసుకెళుతున్నాము.

వెంకటేశులు, రైతు, మధురేపల్లి

విద్యార్థులు చదువులో రాణించాలి : డీఎస్పీ

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచిపేరు ప్రతిష్టలు తేవాలని డీఎస్పీవెంకటేశులు పేర్కొన్నారు. గురువారం రొద్దం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్ హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చిన్న పిల్లలు, మహిళలపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్‌క్రైంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రొద్దం పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. కర్నాటక బార్డర్ సమీపంలో ఉండటంవల్ల సిబ్బంది నేరాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేంద్రకు సూచించారు.



రొద్దం స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కనకదాస విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



కనకదాస విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేసిన నాయకులు

మడకశిర రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పంచాయితీ కేంద్రంలో కురుబల ఆరాధ్య దేవం కనకదాసు విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కురుబ కులస్థులు అందరూ ఐక్యతతో అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు మల్లేశప్ప, పెద్దమూర్తి, రామలింగప్ప వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ తండాలో తీరిన తాగునీటి కష్టాలు



తాగునీటిని తీసుకెళ్తున్న తండావాసులు

మడకశిర రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నా కేఎస్ తండాలో గురువారం బోరు వేయగా నీరు పుష్కలంగా రావడంతో తాండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు గుండుమల చంద్రప్ప మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి. తండాలో తాగునీటి సమస్యఉన్నట్లు తెలిసిన వెంటనే స్పందించి బోరు వేయించారని తెలిపారు. వారికి తండా వాసులు అందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు పాండురంగప్ప, కృష్ణమూర్తి, వెంకటనాయక్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి భక్తులకు విరాళం అందజేత



అయ్యప్ప భక్తులకు విరాళం అందజేస్తున్న దాత గోపాల్‌రెడ్డి

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లిలో అయ్యప్ప భక్తులకు గోపాల్‌రెడ్డి విరాళం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కొండంపల్లి గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి మండలపూజ నిర్వహించేందుకు గోపాల్‌రెడ్డి రూ.10,111 విరాళం అందజేసినట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపన్న, నాగిరెడ్డి, కుమార్‌నాయక్, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం తురకలాపట్నం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు పాఠశాలప్రధానోపాధ్యాయులు శివయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 40మంది విద్యార్థులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబాల దివస్



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు

ధర్మవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బీజేవైఎం యువమోర్చా ఆధ్వర్యంలో వీరబాల దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్, ఆయన కుటుంబం.. దేశం, మతం, ధర్మం రక్షణ కోసం చేసిన త్యాగాలను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం రాంప్రసాద్, వీరబాల దివస్ కార్యక్రమం జిల్లా కో కన్వీనర్ కుళ్లాయప్ప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌ఎంపీ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో వీరబాల దివాస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

టీటీడీ కల్యాణమండపాన్ని అభివృద్ధి చేయండి

కదిరి అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేరు వద్ద ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపం శిథిలావస్థకు చేరుకుందని, దానికి మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేయా లని స్థానిక ప్రముఖులు చేస్తున్నారు. ఈ మేరకు గురు వారం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన సర్వే యర్ రేరాజు సియోధర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కళ్యాణమండపం నిర్వాహణ లోపం వల్ల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, చిన్నపాటి మరమ్మ తులకూ నోచు కోవడం లేదన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ ఉపాధ్యక్షుడు కుటాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీ స్వయంప్రభ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుట్టూరులో వ్యవసాయాధికారులు అనుబంధ శాఖాధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీ మాట్లాడుతూ విరివిగా రాగిపంట సాగుచేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన క్రాప్ ఇన్సూరెన్స్ రైతులకు వస్తుందన్నారు. వరి, వేరుశనగ, మామిడి పంటలకు బీమ లభిస్తుందన్నారు. ప్రీమియం కట్టడానికి ఈనెల 31వరకు గడువు ఉందని సాగుచేసిన ప్రతి రైతు బీమా చెల్లించాలన్నారు. వరికి రూ.630 బీమా చెల్లిస్తే రూ42వేలు, వేరుశనగకు ఎకరా రూ.480చెల్లిస్తే రూ.32వేలు, మామిడికి రూ.1800 చెల్లిస్తే రూ.36వేలు బీమా వస్తుందని రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈనెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ నివేదిత, ఏఈఓ అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, వ్యవసాయశాఖాధికారులు, హార్టికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

లాంతర్లతో వైసీపీ నిరసన



లాంతర్లతో జరిపిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి

గోరంట్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైసీపీ నాయకులు గురువారం రాత్రి లాంతర్లతో శాంతియుతంగా ర్యాలీ చేశారు. మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషా శ్రీచరణ్ ఆధ్వర్యంలో పార్టీనాయకులు లాంతర్లతో నిరసన తెలిపారు. గోరంట్ల వాసవిమహల్ వద్దనుంచి ప్రధాన రహదారిపై బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలపై రూ.15వేల కోట్లు భారం మోపిందన్నారు. ఇందుకు నిరసనగా వైసీపీ పోరుబాట కొనసాగిస్తోందన్నారు. ప్రజలు బాధపడుతున్నారని, వెంటనే ప్రభుత్వం పెంచిన చార్జీలు తగ్గించాలన్నారు సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైసీపీ జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, పొగాకు రామచంద్ర, పోతుల రామక్రిష్ణారెడ్డి, ఫకృద్దీన్, వీరనారాయణరెడ్డి, మేదర శంకర్, మునిలిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఘురామిరెడ్డి, వెంకటశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం



రామాంజనేయులుకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కురుబ రామాంజినేయులు గురువారం అనారోగ్యంతో మృతిచెందడంతో తెలుగుదేశం నాయకులు సంతాపం తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మాదవనాయుడు ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. వీరివెంట టైలర్ ఆంజనేయులు, తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రైం కార్నర్

జూదరుల అరెస్ట్

అగళి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మరసనపల్లి గ్రామ పొలిమేరలో గురువారం జూదమాడుతున్న తొమ్మిది మంది జూదరులను ఎస్ఐ వీరేష్, సిబ్బందితో కలిసి అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ.7100 నగదు, అదేవిధంగా 52పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు, వీరిని మడకశిర మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా, జూదం, మట్కా, గుట్కా, నాటుసారా, అక్రమ మద్యం వంటి వాటికి పాల్పడినా చట్టపర చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని, జైలుకు పంపుతామని హెచ్చరించారు. అదే విధంగా ఆర్‌జిపల్లి గ్రామ సమీపంలో జూదమాడుతుండగా ఏడుగురు జూదరులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ.. 7తులాల బంగారం అపహరణ



వివరాలు సేకరిస్తున్న సీఐ రాఘవన్, సిబ్బంది

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరులో బుధవారం అర్థరాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కురుబపోతన్నకు పక్క పక్కనే రెండు ఇళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో రాత్రి ఓ ఇంటిలో పడుకోగా పక్కింటిలో దుండగులు ప్రవేశించి బీరువా పగులకొట్టి ఏడు తులాల బంగారం, రూ.1.80లక్షలు నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతని ఫిర్యాదు మేరకు సీఐ రాఘవన్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి దొంగల వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్లు దుకాణం దహనం



కాలిపోయిన దుకాణం వద్ద బాధితుడు ఈడిగ శ్రీనివాసులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం కందుకూర్లపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కల్లు దుకాణానికి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు ఈడిగ శ్రీనివాసులు వాపోయాడు. వివరాల మేరకు కందుకూర్లపల్లికి వెళ్లే దారిలో కొంతకాలంగా కల్లు దుకాణం ఏర్పాటుచేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం రాత్రి కల్లు దుకాణానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. దుకాణంలో డ్రమ్ములు తదితర వస్తువులు కాలి రూ.10వేలదాకా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపాడు.